క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయ పల్లె పంచాయతీ వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మి, గోదా సమేత వాసపురం వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్యపూజలు గావించారు. అర్చకులు భక్తాదుల సమక్షంలో స్వామి అమ్మవార్లకు కుంకుమార్చన పూజలు గావించారు.

కార్యకర్తల కృషి అభినందనీయం

నంద్యాల(న్యూటౌన్): పాణ్యం నియోజకవర్గంలో సీపీఎం అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు చేసిన కృషి అభినందనీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్, పార్టీ అభ్యర్థి గౌస్‌దేశయ్ అన్నారు. శనివారం నంద్యాలలోని సీపీఎం కార్యాలయంలో నాగరాజు అధ్యక్షతన కార్యకర్తల అభినందన సభ జరిగింది. వారు మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో చేసిన కృషి సీపీఎం నిర్మాణయుతంగా బలపడటానికి తోడ్పడుతుందన్నారు. దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాల్లో భాగంగా మతోన్మాద బీజేపీని, టీడీపీ, జనసేనలను ఓడించాలని ప్రచారం చేశామన్నారు. 20 రోజుల్లోనే నియోజకవర్గంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించి పట్టుదలతో పార్టీ అభివృద్ధికి, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేశామన్నారు. కార్యక్రమంలో ఏసురత్నం, రాజశేఖర్, రణధీర్, నరసింహనాయక్, వెంకటేశ్వర్లు, రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



ఇంజేడులో లక్ష్మీవేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, ఇంజేడు, సుద్దమల్ల గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయ స్వామికి, లక్ష్మీవేంకటేశ్వరస్వామి, లక్ష్మి నరసింహ కంబగిరిస్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజ తదితర పూజలు నిర్వహించి భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, అనంతయ్య, కమలేష్‌శర్మలు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ట్రేడ్ లైసెన్స్ రుసుము సకాలంలో చెల్లించాలి

నంద్యాల(సిటీ): పట్టణ పరిధిలో ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులందరూ తమ ట్రేడ్ లైసెన్స్ రుసుములు సకాలంలో చెల్లించి పురపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి కోరారు. మున్సిపల్ పరిధిలోని స్కూల్స్, కళాశాలలు, ఆసుపత్రులు, బార్ - రెస్టారెంట్‌లు, హోటళ్లు, దుకాణాలు ప్రతి సంవత్సరం నో అబ్జెక్షన్ సర్టిఫికెట్(ఎన్‌ఓసీ), శానిటేషన్ ధ్రువపత్రాలు పొందాలని పేర్కొన్నారు. ట్రేడ్ లైసెన్స్ పొందిన వారు సకాలంలో రెన్యువల్ చేసుకోవాలని, కొత్తగా వ్యాపారం ప్రారంభించిన వారు ట్రేడ్ లైసెన్స్, ఇతర మున్సిపల్ శాఖ అనుమతులు పొందాలన్నారు. అనుమతులు లేని వ్యాపారాల పై మున్సిపల్, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ అశోకవర్ధన్‌రెడ్డి

ఆత్మకూరు: డీలర్లు నకిలీ విత్తనాలు, మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ అశోకవర్ధన్‌రెడ్డి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని పలు ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ రైతులు కొన్న విత్తనాలకు కచ్చితంగా రశీదు పొందాలన్నారు. లైసెన్సు కంపెనీ విత్తనాలను మాత్రమే డీలర్లు అమ్మాలని, ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విత్తనాలను అమ్మితే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులు విత్తనాలను నాటిన తర్వాత విత్తన ప్యాకెట్లను తమ వద్దే ఉంచుకోవాలన్నారు. అలాగే బిలుల్లు లేకుండా తక్కువ ధరకు ఇస్తానంటే తీసుకోవద్దని సూచించారు. తగిన ధ్రువపత్రాలు లేని రూ.3,09,312 విలువ గల విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు ఏడీఏ తెలిపారు.

అడ్మిషన్.. అటెన్షన్

- ముందస్తు అడ్మిషన్లపై జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోవద్దు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే పిల్లలను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్ గుర్తింపుపై ఆరా తీయాలి
- క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారా.. పరిశీలించాలి



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు(ఫైల్)

నంద్యాల(న్యూటౌన్): 2024–25 విద్యా సంవత్సరం మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. జిల్లాలో పుట్టగొడుగుల్లా ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు తోక పేర్లతో నూతన బ్రాంచీలను ఆయా ప్రాంతాల్లో ప్రారంభించేందుకు సిద్ధమయ్యాయి. ఇందుకు హంగులూ, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియను చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొత్త ప్రైవేటు పాఠశాల ప్రారంభించాలంటే విద్యాశాఖ అనుమతి తీసుకోవాలి. మొదటి ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాలి. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ (ఆర్జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాలి. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యామండలి సమ్మతించాల్సి ఉంటుంది.

సీబీఎస్ఈ పేరుతో మోసం..

గత విద్యాసంవత్సరం నంద్యాల జిల్లాలో ఓ కార్పొరేట్ పాఠశాల తమకు సీబీఎస్ఈ అనుమతి ఉందంటూ ప్రచారాలు చేసుకుని ప్రవేశాలు చేపట్టింది. ఈ విషయంపై అవగాహన లేక కొందరు తమ పిల్లలను చేర్పించారు. పుస్తకాలు తీసుకున్నారు. వేలల్లో ఫీజులు చెల్లించినా విద్యార్థులకు స్టేట్ సిలబస్ బోధనలు చేస్తున్నారంటూ తల్లిదండ్రులు ఆందోళనలు చేశారు.

గుర్తింపు కచ్చితంగా ఉండాలి..

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. గుర్తింపు పొందిన విద్యా సంస్థలలోనే తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థిగానే పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరం.

పరిశీలించాల్సిన అంశాలు

- తొలుత పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా లేదా అనేది చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- మౌలిక వసతులు చూసుకోవాలి. బాత్రూంలు, మరుగుదొడ్లు, నీటి సదుపాయాలు తప్పనిసరి. విద్యార్థులు మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే క్రీడా ప్రాంగణం, అనుగుణంగా క్రీడా ఉపాధ్యాయులు ఉన్నారా లేదా ఆరా తీయాలి.
- అర్హత గల ఉపాధ్యాయులు బోధనలు చేస్తున్నారా లేదా పరిశీలించాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉపాధ్యాయుడు ఉండాలి.
- సురక్షిత రవాణా సదుపాయానికి బస్సులకు రవాణాశాఖ సామర్థ్య పరీక్ష పత్రాన్ని జారీ చేస్తుంది. సుశిక్షితుడైన డ్రైవరు తప్పనిసరి.
- జీ–1 భవనాలు ఉంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలు ఆర్పే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- ప్రభుత్వం అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, బదిలీ ధ్రువపత్రాలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడిబయట ఉన్నవారీగా పేర్కొంటున్నారు.

ఓంకారంలో భక్తుల సందడి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం పుణ్యక్షేత్రంలో శనివారం వీకెండ్ సందర్భంగా భక్తులసందడి నెలకొంది. పలు ప్రాంతాలకు చెందిన వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వర స్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో రద్దీ కనిపించింది. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం, సాయంత్రం అష్టవిధ మహామంగళ హారతులు, రుద్రాభిషేకం, అర్చన పూజలు నిర్వహించారు. భక్తులు స్థానిక కాశినాయన అన్నపూర్ణ ఆశ్రమంలో అన్నప్రసాదాలు స్వీకరించారు.

చదువును మించిన సంపద లేదు



పిల్లలకు నీతి కథ చెబుతున్న లైబ్రేరియన్ మద్దమ్మ

పగిద్యాల: చదువును మించిన సంపద లేదని.. కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని లైబ్రేరియన్ మద్దమ్మ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు ఇంగ్లిష్ గ్రామర్, ఆర్టికల్స్‌ను సీనియర్ టీచర్ మల్లేశ్వరరావు బోధించారు. బాల్యం నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పిల్లికి పెత్తనం కథలోని నీతిని పిల్లలకు వివరించారు.

ప్రశాంతంగా డిప్యూటీ ఈఓ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసి వస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్స్ పోస్టుల నియామక పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు డీఆర్‌ఓ పద్మజ తెలిపారు. పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల, రామకృష్ణ పీజీ కళాశాల, ఎస్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11.30గంటల వరకు పరీక్షలు జరిగాయి. ఉదయం 7.30 గంటల నుంచి 8.15 గంటల్లోపు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో 605 మంది అభ్యర్థులకు గాను 338 మంది పరీక్షకు హాజరయ్యారు. 56 శాతం హాజరైనట్లు డీఆర్‌ఓ తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులకు తాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంపు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాలకు చేరుకోవడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కూడా కల్పించారు. జిల్లాలోని మూడు పరీక్ష కేంద్రాలను జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, సెక్షన్ ఆఫీసర్లు, లైజన్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు పరిశీలించారు.

వెజిటబుల్స్...రేట్లు డబుల్!



కిలో రూ.100 చేరిన పచ్చిమిర్చి



కిలో రూ.80 విక్రయిస్తున్న కాకర

దొర్నిపాడు: వర్షాభావ పరిస్థితుల మూలంగా కూరగాయల సాగు తగ్గిపోయింది. దీంతో వేసవితోపోటీ అన్నట్లుగా కూరగాయల ధరలు మండిపోతున్నాయి. నెల వ్యవధిలోనే ధరలు రెట్టింపయ్యాయి. ప్రత్యేకించి గత వారంరోజులుగా కూరగాయాల ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యుడు ఏ మాత్రం కొనలేని పరిస్థితి నెలకొంది. రూ.100కు ఏమాత్రం తగ్గనంటూ పచ్చిమిర్చి హెచ్చరిస్తుంటే ఎవరి మాటవినమంటూ టమాటా రూ.కిలో 40 పలుకుతుంది. అలాగే క్యారెట్ రూ.40 నుంచి 60, బీన్స్ రూ.80నుంచి రూ.140 వరకు చేరుకుంది. అలాగే నను తాకొద్దంటూ కాకర రూ.80 కాగా, మేము ఏం తక్కువ కాదంటూ బెండ రూ.60 పలుకుతోంది. గత వారంతో పోలిస్తే అన్ని వెజిటబుల్స్ ధరలు డబుల్స్ అయ్యాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. కూరగాయలు కొనలేం.. తినలేం అంటున్నారు సామాన్యులు.

శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించిన మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి



శివాజీ కాంస్య విగ్రహం ముందు సీఎం మోహన్ యాదవ్ దంపతులు

శ్రీశైలం: శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ దంపతులు శనివారం సందర్శించారు. శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల దర్శనానంతరం శివాజీ మెమోరియల్ కాంప్లెక్స్ నిర్వాహకుల ఆహ్వానం మేరకు సీఎం దంపతులు హైదరాబాద్ వెళ్లడానికి ముందుగా శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. మరాఠా యోధుడి గురించి రాసిన విశేషాలు, చిత్రపటాలు తదితర వాటిని తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ రమేష్ నాయుడు, జిల్లా కోఆర్డినేటర్ అభిరుచి మధు, జిల్లా ప్రధాన కార్యదర్శి అరవింద్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కనుల పండువగా వైకుంఠనాథుని కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న దృశ్యం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామివారి మూలవిగ్రహాలు

జూపాడుబంగ్లా: మండలకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవిలతో వైకుంఠనాథుని కల్యాణం కనుల పండువగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన వంటి విశేష పూజలు నిర్వహించి పన్నీటి స్నానం చేయించారు. పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా తీర్చిదిద్దారు. ముస్తాబైన స్వామి, అమ్మవార్ల విగ్రహాలను వేదమంత్రాలు పఠిస్తూ పెళ్లిపీటలపైకి చేర్చారు. అనంతరం అర్చకులు పెళ్లిమంత్రాలు పఠిస్తుండగా భక్తులు కళ్యాణ క్రతువును జరిపించారు. మాంగల్యం తంతునానేనా అంటూ వేదమంత్రాలను పఠిస్తుండగా పండితులు స్వామివారి తరుపున శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల మెడల్లో మాంగల్యధారణ చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఇంజేడు గ్రామస్తులతో సమావేశమైన ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత్‌నాయక్

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ప్రజల శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించిన కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత్ నాయక్ హెచ్చరించారు. శనివారం సమస్యాత్మకమైన గ్రామం ఇంజేడులో ఆళ్లగడ్డ రూరల్ సీఐ, శిరివెళ్ల, ఆళ్లగడ్డ టౌన్ సీఐలు చంద్రబాబు, రమేష్‌ల ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ రామాంజనేయరెడ్డి, రుద్రవరం ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, బీఎస్ఎఫ్ జవాన్లు కవాతు నిర్వహించారు. గ్రామంలో ఇరు వర్గాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకుల గృహాలలో సోదాలు చేశారు. ప్రధాన కూడలిలో రాజకీయ పార్టీల నాయకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఇతరులను రెచ్చగొట్టేలా ప్రవర్తించినా ప్రోత్సహించినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విజయోత్సవాలు నిషేధం

శిరివెళ్ల: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జూన్ 4న కౌంటింగ్ సందర్భంగా విజయోత్సవాలపై నిషేధం ఉందని సీఐ చంద్రబాబు స్పష్టం చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ పోలింగ్‌కు ఎంత జాగ్రత్తలు తీసుకున్నామో అంతకుమించి కౌలింగ్‌పై దృష్టి సారించామన్నారు. 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు అభ్యర్థులు, ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉందని, ఇతరులు రాకూడదని సూచించారు. జాతీయ రహదారిపై ఆళ్లగడ్డ, శిరివెళ్ల మెట్ట వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు ఉంటుందని, ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారన్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రాలకు ఆ రోజు ఎవ్వరూ వెళ్లకూడదని, ఈ నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. కౌంటింగ్ రోజున మద్యం దుకాణాలు మూసి వేయిస్తామన్నారు. కౌంటింగ్ అయిపోయాకా విజయోత్సవ ర్యాలీలు, సంబరాలకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘించి కేకలు వేయడం, బాణసంచా పేల్చడం తదిర సంబరాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాలలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే సోషల్ మీడియాలో కించపరిచే మెసేజ్‌లు పెట్ట వద్దని, అలా జరిగితే అడ్మిన్లను బాధ్యులను చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కానాలలో పోలీసు కవాతు



గ్రామంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నంద్యాల(అర్బన్): ఎన్నికల కౌంటింగ్, ఫలితాలను దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో కవ్వింపు చర్యలకు పాల్పడకుండా కానాల గ్రామంలో శనివారం సాయంత్రం పోలీసులు కవాతు నిర్వహించారు. రూరల్ సీఐ దస్తగిరిబాబు, ఎస్ఐలు నాగరాజు, మల్లికార్జునల ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో పర్యటించారు. వారు మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ జరగనుందన్నారు. ఫలితాల అనంతరం గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరిగినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరు ఏ సమయంలోనూ కవ్వింపు చర్యలకు పాల్పడవద్దని సూచించారు.



గాజుల దుకాణంలో మహిళలు



ఉరుసు సందర్భంగా పట్టణంలో జనసందోహం

ఊరంతా ఉరుసు సందడి



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న తిరుపంరెడ్డి

వెలుగోడు: పట్టణంలో హజరత్ సయ్యిదా రోఖియా బీబీ ఉరుసు మహోత్సవాలు అంగరంగ వైభవంగా, ఉత్సాహంగా సాగుతున్నాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి రోఖియాబీ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి ఫాతేహాలు సమర్పించారు. భక్తులు, బంధుమిత్రుల రాకతో పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలో వెలసిన గాజులు, బొమ్మల దుకాణాల వద్ద రద్దీ నెలకొంది. అధిక జనసందోహంతో ప్రధాన వీధులు కళకళలాడుతున్నాయి.

రసవత్తరంగా ఎద్దుల బండ లాగుడు పోటీలు

పట్టణంలో హజరత్ సయిదా రోఖియా బీబీ ఉరుసు సందర్భంగా ఆరు పండ్ల లోపు విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను శనివారం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. పోటీల్లో శ్రీ సత్యసాయి జిల్లా పుల్లేటి పల్లె గ్రామానికి చెందిన బచ్చుల భాస్కర్ రావు వృషభాలు మొదటి స్థానంలో నిలువగా దాతల సహకారంతో రూ.40 వేల నగదు బహుమతిని అందజేశారు. ఏ. కోడూరుకు చెందిన చాగంటి నాగేశ్వరరావు ఎద్దులు రెండో స్థానంలో రూ.30 వేలు, మూడో స్థానంలో తాండ్రపాడుకు చెందిన చిన్న రత్నం, మల్యాల ఎస్ఎస్‌వీ ట్రేడర్స్ వృషభాలు రూ.20 వేల నగదు గెలుచుకున్నాయి. నాలుగో స్థానంలో పెద్ద కొట్టాలకు చెందిన భారతి ఎద్దులు నిలిచి రూ.15 వేల నగదును అందుకున్నాయి. ఐదో స్థానంలో నిలిచిన మిడ్తూల్ మండలం జక్కిలేరు గ్రామానికి చెందిన అమర్‌సాహెబ్ ఎద్దులకు రూ.10 వేలు, ఆరో స్థానంలో నంద్యాలకు చెందిన బొల్లి శేషయ్య ఎద్దులకు రూ.5 వేలు, ఏడో స్థానంలో కే. బొల్లవరం గ్రామానికి చెందిన బోయిన రవితేజ వృషభాలకు రూ.3 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు యూనుసు, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, మండల కార్యదర్శి కే. రామ్మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, నాయకులు నసిరుల్లాఖాన్, షంషీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి కత్తి పోట్లు

శిరివెళ్ల: మోత్కులపల్లెకు చెందిన వడ్డె మల్లికార్జున కత్తి పోట్లకు గురయ్యాడని ఎస్ఐ సురేష్ శనివారం తెలిపారు. బాధితుడు మరో ముగ్గురి రోడ్డు కాంట్రాక్ట్ కింద వర్కర్లుగా పని చేస్తున్నారు. ఈ క్రమంలో శనివారం నంద్యాలలో ఓ హోటల్‌లో భోజనం చేసి బిల్లు చెల్లించే విషయంలో వడ్డె మల్లికార్జున, శివ మధ్య ఘర్షణ జరిగింది. తిరిగి స్వగ్రామం చేరుకున్నాక రెండు కుటుంబాల మధ్య మళ్లీ ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో శివ కత్తితో మల్లికార్జునపై దాడి చేసి గాయ పరచాడు. పోలీసులు గ్రామానికి చేరుకొని విచారణ చేశారు. గాయపడిన వ్యక్తిని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. కాగా ఇరువురు చిన్నాన్న, పెద్ద నాన్న కుమారులని పోలీస్‌లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. కోవెలకుంట్లకు చెందిన సురేష్, చెన్నయ్య బనగానపల్లె నుంచి బైక్‌పై వస్తుండగా గులాంనబీపేట సమీపంలో అదుపుతప్పడంతో కిందపడి గాయాలపాలయ్యారు. అటుగా వెళ్తున్న ప్రయాణికులు 108 అంబులెన్స్‌కు సమాచారం చేరవేయడంతో సిబ్బంది క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు.